గులాబీ శ్రేణుల్లో జోష్

- ఉత్సాహం నింపిన కేసీఆర్ రోడ్‌షో
- వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- అడుగడుగునా అభిమానుల నీరాజనం

కామారెడ్డి/మాచారెడ్డి, మే 7 : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన రోడ్‌షో విజయవంతమైంది. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు జనం తరలివచ్చారు. నిజామాబాద్ నుంచి కామారెడ్డికి చేరుకున్న గులాబీ దళపతికి డప్పుల దరువు, గుస్సాడి నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి భారీ మేళ తాళాలు, డబ్బు చప్పుళ్లతో కమాన్ మీదుగా స్టేషన్ రోడ్, సిరిసిల్ల రోడ్ మీదుగా జేపీఎన్ రోడ్డు వరకు కేసీఆర్ బస్సుయాత్ర కొనసాగింది. ర్యాలీలో కళాకారులు తమ ఆటపాటలతో ఉర్రూతలూగించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని స్వాగత ర్యాలీలో పాల్గొన్నారు. కేసీఆర్ జేపీఎన్ రోడ్డు వద్దకు చేరుకోగానే జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేసీఆర్ ప్రసంగం ముగిసే వరకు ప్రజలు ఆసక్తిగా విన్నారు. కేసీఆర్ రాక నేపథ్యంలో పట్టణంలో భారీ కటౌట్లు, గులాబీ జెండాలు ఏర్పాటు చేయడంతో పట్టణం గులాబీమయంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేసీఆర్ కామారెడ్డి రావడంతో గులాబీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం నెలకొంది. నాయకులు, కార్యకర్తల్లో జోష్ కనిపిస్తోంది. జహీరాబాద్ పీటంపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశాయి. రోడ్‌షోలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ షిండే, జహీరాబాద్ లోక్ సభ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అశేష జనవాహిని మధ్య కేసీఆర్ రోడ్ షో



బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్. పక్కన మాజీ స్పీకర్ పోచారం, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

గులాబీ జెండాలతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

బోనాలు, సంప్రదాయ నృత్యాలతో కేసీఆర్‌కు స్వాగతం..

కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్న పార్టీ శ్రేణులు, జనం

వేలాదిగా తరలి..

ఎల్లారెడ్డి/గాంధారి/బాన్సువాడ/బీబీపేట్, మే 7: జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి, బీబీపేట్, బాన్సువాడ మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వెళ్లి స్వాగతం పలికారు. బాన్సువాడ నుంచి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం భాస్కర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో, బీబీపేట్ మండలం నుంచి జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

పోచారం భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్‌షోకు తరలుతున్న నాయకులు, కార్యకర్తలు

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఓటు: కలెక్టర్

ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు 5కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మే 7: ఓటు.. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేదని, ప్రతి పౌరుడూ వినియోగించుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేయడానికి మంగళవారం నిర్వహించిన 5కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నోడల్ అధికారి వెంకటేశం, జిల్లా అధికారులు, విద్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి.. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన మరమ్మతు పనులను రాబోయే విద్యాసంవత్సరం ప్రారంభించే లోపే పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన పనులను మంగళవారం తనిఖీ పరిశీలించారు. అనంతరం మున్సిపల్ నర్సరీ, చౌరస్తాలో ఉన్న చెక్‌పోస్టును తనిఖీ చేశారు.

అభివృద్ధిలో 'బాన్సువాడ'ది ప్రత్యేక స్థానం: పోచారం

కారు గుర్తుకు ఓటు వేయాలని నమూనా బ్యాలెట్‌ను చూపిస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ టౌన్, మే 7: అభివృద్ధితో బాన్సువాడ నియోజకవర్గాన్ని దేశంలోనే ప్రత్యేక స్థానంలో నిలబెట్టినట్లు మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని 9, 11, 12వ వార్డుల్లో మంగళవారం పర్యటించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పదేండ్లలోనే ఏ నియెజకవర్గం లేని విధంగా తక్కువ సమయంలోనే బాన్సువాడను అభివృద్ధి చేసి చూపించానన్నారు. ఈ క్రమంలో కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పలేదని, దీంతో కొందరు ఇబ్బంది పడినప్పటికీ ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. తనకు సంపాదనపై కాంక్ష లేదని, కేవలం నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమని స్పష్టం చేశారు. అన్ని వర్గాలకు పథకాలు అందజేసిన బీఆర్ఎస్‌కే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి ఎంపీగా గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని ప్రజలను కోకారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు ఎజాస్, మోహన్‌నాయక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు గులిపెల్లి అనిత, కార్యదర్శులు నార్ల ఉదయ్, ప్రతిమారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లి లేదనే బెంగతో.. కూతురు మృతి
ఒకేసారి ఇద్దరి అంత్యక్రియలు.. బోర్లంలో విషాదం

బాన్సువాడ రూరల్, మే 7: తన తల్లి ఇక లేదనే బెంగతో కూతురు మృతిచెందిన ఘటన బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. కాటేపల్లి చోటీబీ (75) కొంతకాలంగా పెద్ద కూతురు రజియాబీ (60)తో కలిసి బాన్సువాడలో చిన్నకూతురు వద్ద ఉంటున్నది. అనారోగ్యంతో తల్లి సోమవారం అర్ధరాత్రి మరణించింది. దీంతో పెద్ద కూతురు రజియాబీ బోరున విలపిస్తూ సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెకు ప్రథమ చికిత్స చేయించిన అనంతరం తల్లి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా, మరోసారి అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందింది. దీంతో ఇద్దరి అంత్యక్రియలనూ ఒకేసారి నిర్వహించారు. గంటల వ్యవధిలో తల్లీకూతురు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మానసిక రోగాలపై అవగాహన

రామారెడ్డి, మే 7: సమాజంలో మానసిక ఆరోగ్యంపై అవగాహనలేమితో ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి ప్రత్యేక చికిత్స, కౌన్సెలింగ్ ద్వారా నయం చేయవచ్చని మానసిక వైద్య నిపుణుడు రమణ అన్నారు. మంగళవారం ఆయన రామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం, దవాఖాన వైద్య సిబ్బందితో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేశ్, మానసిక ఆరోగ్య కార్యకర్త డాక్టర్ రాహుల్, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రేరణ'కు జిల్లా విద్యార్థిని ఎంపిక

భవజ్ఞ

భిక్కనూరు, మే 7: మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో గుజరాత్‌లో ఈ నెల 26 నుంచి 31 వరకు నిర్వహించనున్న ప్రేరణ కార్యక్రమానికి మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని భవజ్ఞ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మణిదీప్తి తెలిపారు. దేశ వ్యాప్తంగా ఇరవై మందిని ఎంపిక చేయగా, అందులో రాష్ట్రం నుంచి భవజ్ఞ ఒకరు కావడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

బాన్సువాడ, మే 7: ఎన్నికల నేపథ్యలో పౌరులు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని జహీరాబాద్ లోక్‌సభ స్థానం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రమేశ్ రాథోడ్ సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఎంపీడీవోలు, సెక్టోరల్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులతోపాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలోని 26 రూట్లకు సెక్టోరల్ అధికారులు, జీపీఎస్ ట్రాకింగ్‌తో వాహనాలు, పోలీస్ సిబ్బందిని కేటాయించామని తెలిపారు.

మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రమేశ్ రాథోడ్

సంక్షిప్తంగా..

- **సర్టిఫికెట్ల అందజేత..** బాన్సువాడ, మే 7 : ఇటీవల రక్తదానం చేసిన ఏఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులకు బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ మంగళవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందించారు.
- **కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ..** డోంగ్లీ, మే 6: మండలంలోని పెద్దటాక్లీ గ్రామంలో ఉపాధి కూలీలకు మంగళవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కూలీల హాజరు పెంచేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.
- **గడ్డివాము దగ్ధం..** రామారెడ్డి, మే 7: మండల కేంద్రంలో కాసార్ల లింగం అనే రైతుకు చెందిన గడ్డివాముకు మంగళవారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. స్థానికులు, పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.
- **పూడికతీత పనుల పరిశీలన..** రామారెడ్డి, మే 7: మండలంలోని పోసానిపేట్ గ్రామంలో కొనసాగుతున్న చెరువు పూడికతీత పనులను డీఆర్డీవో చందర్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. కూలీల కోసం ఏర్పాటు చేసిన తాగునీరు, షేడ్‌నెట్లను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. కూలీలందరికీ పని కల్పించాలని సూచించారు.

దేశాయిపేట్ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సలాబత్‌పూర్ గ్రామంలో ప్రచారం చేస్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండాలో..

బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరం

మద్నూర్/మాచారెడ్డి/ మే 7: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరం చేసింది. నాయకులు, కార్యకర్తలు మంగళవారం గడప గడపకూ వెళ్లి గులాబీ పార్టీ గెలుపు ఆవశ్యకతను ఓటర్లకు వివరించారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. మద్నూర్ మండలం సలాబత్‌పూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాచారెడ్డి మండలం గజ్యానాయక్‌తండా ఎక్స్‌రోడ్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు లోయపల్లి శ్రీధర్‌రావు, హంజీనాయక్, అబ్దుల్‌ఖాన్, భాస్కర్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్, బోర్లం, ఇబ్రహీంపేట్ గ్రామాల్లో మాజీ సర్పంచులు నారాయణ రెడ్డి, శ్రావణ్‌కుమార్, నాయకులు డి.నారాయణ రెడ్డి, గోపన్‌పల్లి సాయిలు, సాయిలు యాదవ్, పర్వంరెడ్డి, ప్రశాంత్‌కుమార్, సయ్యద్ జలీల్, మన్నెచిన్న సాయిలు, పండరి తదితరులు ప్రచారం చేశారు.